


నేడు జడ్పీ సమావేశం

రంగారెడ్డి అర్బన్, జూన్ 10 : జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నేడు నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి తెలిపారు. ఖైరతాబాద్‌లోని జడ్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఈ సమావేశాకి చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్న ఈ సమావేశానికి జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో సకాలంలో హాజరు కావాలని జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇంతలో ఎంత తేడా.. 2023 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీలతో విజయ ఢంకా మోగించిన కాంగ్రెస్ పార్టీ ఈ ఏడాది మేలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బోల్తా కొట్టింది. చేవెళ్ల లోక్‌సభ స్థానంలో ఆ పార్టీకి తక్కువ ఓట్లు రావడం, అభ్యర్థి ఓటమి చెందడంపై పార్టీ నేతలు అంతర్మథనంలో పడ్డారు. ఈ స్థానం పరిధిలో ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలోనూ గెలవని బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజారిటీతో ఎలా గెలిచింది. ఇంత తక్కువ సమయంలో ఫలితాలు ఎందుకు తారుమారయ్యాయి. ఎక్కడ లోపం జరిగింది.. నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేశారా.. లేదా?. అన్న వివరాలను సేకరించే పనిలో పడింది కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం. ఓటమికి గల కారణాల అన్వేషణలో పార్టీ అధిష్ఠానం బిజీగా ఉంది.

- ఓట్ల వేటలో ఎందుకు వెనకపడ్డాం
- ఎక్కడ లోపం జరిగింది..
- పోలింగ్ కేంద్రాల వారీగా లెక్కలు
- బీజేపీకి అంత మెజారిటీకి కారణాలేంటి
- ఫలితాల విశ్లేషణలో కాంగ్రెస్ అధిష్ఠానం
- చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో ఓటమికి కారణాలపై ఆరా






ఎందుకిలా!

హస్తంలో అంతర్మథనం!



ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూన్ 10 : అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్మథనం మొదలైంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా.. చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో ఓడిపోవడం పార్టీ అధిష్ఠానం ఆరా తీస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటిన కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో చతికిల పడటంతో నాయకులు అంతర్మథనంలో పడ్డారు. గెలుపు అంచనాలు తలకిందులు కావడానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ నాయకులు ముందుకు సాగారు. విజయం మాత్రం కమలం పార్టీని వరించింది. 24 రౌండ్ల ఓట్ల లెక్కింపులో అన్ని రౌండ్లలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆధిక్యతను చాటుకోవడం అందరినీని ఆశ్చర్యానికి గురి చేసింది. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజవర్గాలున్నాయి. అందులో గత అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో హస్తం పార్టీ హవా చాటింది. రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, మహేశ్వరం, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ నియోజక వర్గాలు బీఆర్ఎస్ పార్టీ తన ఖాతాల్లో వేసుకుంది. ఇటీవలే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వికారాబాద్ అసెంబ్లీ స్థానంలో స్వల్ప ఓట్ల మెజారిటీ (8,232) మినహా మిగతా ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మెజారిటీ రాకపోవడంతో పార్టీ శ్రేణులతో చర్చిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా దక్కని బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజారిటీ రావడం కాంగ్రెస్‌కు ఊహించిన షాక్ తగిలింది. ఎవరూ ఊహించని తీరులో భారీ మెజారిటీ (1,72,897) రావడంతో కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్నికల ప్రచారానికి స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరై విస్తృత ప్రచారం నిర్వహించినా ఫలితం లేకపోవడంతో హస్తం శ్రేణుల్లో నిరాశని నింపింది. ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపడానికి గల కారణం ఏమిటనే ఆలోచనలో పడ్డారు. అసలు ఏం జరిగిందనే దానిపై క్షేత్రస్థాయిలో సమాచారం సేకరిస్తున్నారు. నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేశారా? లేకపోతే బీజేపీకి కోవర్టులుగా మారారా అన్న సమాచారం తీసుకుంటున్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా లెక్కలు తీస్తున్నారు. కాంగ్రెస్ బలంగా ఉన్న గ్రామాల్లో బీజేపీ గాలి వీయడానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. ఐదున్నర నెలల కిందటే రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ పార్టీకి కూడా ఈ ఎన్నికల్లో ఇబ్బందికర పరిస్థితులే ఎదురయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఆదరణ లోక్‌సభ ఎన్నికల్లో రాకపోవడంతో పార్టీ శ్రేణులు జరిగిన తప్పిదాలు, కారణాను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల వారీగా ఓట్లు ఎందుకు తగ్గాయనే విషయమై నాయకులు చర్చిచుకుంటున్నారు.



పట్టణ ప్రాంతాల్లో బీజేపీకి ఎక్కువ లీడ్

బీజేపీకి ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా లీడ్ ఇచ్చింది. మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాలు బీజేపీ అభ్యర్థి కొండాకు భారీ ఆధిక్యతను తెచ్చిపెట్టాయి. ఎన్నికల్లో అభ్యర్థిని గెలిపించేందుకు కొన్ని ప్రాంతాలకు కొంతమంది నేతలకు పార్టీ అదిష్ఠానం ఇన్‌చార్జి బాధ్యతలను కట్టబెట్టింది. ఇందులో భాగంగా మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్‌కు మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్‌కు మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, ఆర్కేపురానికి దేప భాస్కర్‌రెడ్డి, సరూర్‌నగర్ జీహెచ్‌ఎంసీకి సీనియర్ నాయకులు దయాకర్‌రెడ్డి, శంకర్ యాదవ్, మహేందర్‌రెడ్డి, మహేశ్వరానికి జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి ఇన్‌చార్జిలుగా వ్యవహరించారు. మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి నాయకత్వంలో గట్టిగా నాయకులు మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించినా కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి కేవలం 99,175 ఓట్లు రావడం అశ్చర్యానికి గురి చేసింది. రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా ఇదే తరహాలోనే ఓట్ల వేటలో కాంగ్రెస్ వెనకబడింది. చేవెళ్ల అంటేనే కాంగ్రెస్‌కు కంచుకోట అని పేరు. ఇక్కడ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి భీంభారత్ స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. అయితే, ఇక్కడ కూడా బీజేపీకే లీడ్ వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఊహించిన రీతిలో ముందుకు వెళ్లలేక పోయింది. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిపై రాష్ట్రస్థాయిలో సమీక్షించడంతో పాటు ఏ నియోజకవర్గంలో ఎంత మేరకు తగ్గిందో ఓట్ల లెక్కలకు అనుగుణంగా కాంగ్రెస్ నేతలు సమీక్షిస్తున్నారు. ఎక్కడెక్కడ నేతలు పని చేశారు, ఎక్కడ చేయలేదన్న వివరాలను తీసుకోవడంతో పాటు రాష్ట్రస్థాయి సమావేశంలో చర్చించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ నేతలకు పదవీ గండాన్ని తెచ్చే అవాకశాలు ఉన్నాయన్న చర్చ జోరుగా సాగుతోంది. ఈ ఫలితాలు ఎవరి పదవులను ఊడగొడతాయో.. ఎవరికి పదవుల కాకుండా అడ్డుపడతాయోననే ఆందోళన ఆశావాహుల్లో వ్యక్తమవుతోంది. ఈ ఎన్నికల్లో పనితీరు, ఫలితాల ఆధారంగా మంత్రివర్గ విస్తరణతో పాటు నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందని.. ఇప్పటికే ఆ పార్టీ అధిష్ఠానం రాష్ట్ర నేతలకు తేల్చి చెప్పింది. దీంతో తమ పదువులకు డోకా లేదని పలువురు నేతలు అప్పట్లో గంతులేశారు. కానీ.. ఓటింగ్ నాటికి పరిస్థితి పూర్తిగా మారిపోవడంతో ఇప్పుడు వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఫలితంపై కొంత అసహనం వ్యక్తం చేసిన విషయం అందరికి తెలిసిందే.

ప్రధాన పార్టీలకు అసెబ్లీ నియోజకవర్గాల వారీగా వచ్చిన ఓట్లు

నియోజకవర్గం	బీఆర్ఎస్	బీజేపీ	కాంగ్రెస్	ఆధిక్యం (పార్టీ)
మహేశ్వరం	37,215	1,49,527	99,175	50,352 (బీజేపీ)
రాజేంద్రనగర్	28,529	1,57,701	1,38,495	19,206 (బీజేపీ)
శేరిలింగంపల్లి	42,687	1,78,249	1,04,472	73,777 (బీజేపీ)
చేవెళ్ల	21,410	93,778	71,678	22,100 (బీజేపీ)
పరిగి	23,142	74,024	71,816	2,208 (బీజేపీ)
వికారాబాద్	13,959	67,584	75,361	8,232 (కాంగ్రెస్)
తాండూరు	10,598	77,654	69,864	7,790 (బీజేపీ)
ఈవీఎం ఓట్లు	1,77,540	7,98,517	6,30,861	1,67,656 (బీజేపీ)
పోస్టల్ బ్యాలెట్స్	1,428	11,365	6,124	5,241 (బీజేపీ)
మొత్తం ఓట్లు	1,78,968	8,09,882	6,36,985	1,72,897 (బీజేపీ)



ప్రజల సమస్యలను వింటున్న కలెక్టర్ శశాంక

'ప్రజావాణి' ఫిర్యాదులను పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జూన్ 10 : 'ప్రజావాణి'కి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరై ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. అనంతరం వాటిని పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లాకు సంబంధించి ప్రజలు హైదరాబాద్‌లో అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులకు పంపుతున్నామన్నారు. అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఒకవేళ వినతులు పరిష్కారం కానట్లయితే, అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. ప్రజావాణి రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. రిజిస్టర్‌లో నమోదు చేయడం ద్వారా ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి.. వాటిలో ఎన్ని పరిష్కరించారు, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని తెలుస్తుందని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణికి వచ్చేటప్పుడు రిజిస్టర్ తీసుకొని రావాలని తెలిపారు. ప్రతీ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఉదయం 10.30 గంటలకు జిల్లా అధికారులు, మండల అధికారులు, మున్సిపల్ అధికారులందరూ రావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

99 రోజుల తర్వాత తిరిగి ప్రజావాణి..

మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఫిబ్రవరి 26 నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేశారు. ఈ ఎన్నికల కోడ్ అలాగే ఉండగానే చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల కోడ్ మార్చి 18 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ నెల 4న పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ పూర్తి అయ్యింది. ఆరో తేదీన ఎన్నికల కోడ్ ఎత్తేశారు. దీంతో పదో తేదీ సోమవారం నుంచి యధావిధిగా ప్రజావాణి కార్యక్రమాన్ని కొనసాగించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించేందుకు మూడు నెలల మూడు రోజుల సమయం పట్టింది. చాలా రోజుల తర్వాత ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం కావడంతో బాధితులు ఎన్నో సమస్యలతో సోమవారం ప్రజావాణికి చేరుకున్నారు. ప్రజావాణిలో సోమవారం బాధితుల నుంచి 79 ఫిర్యాదులను స్వీకరించారు.

ఫిట్‌నెస్ లేని బస్సులపై కఠిన చర్యలు

- ఉమ్మడి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్



రంగారెడ్డి అర్బన్, జూన్ 10 : జూన్ 12 నుండి పాఠశాలలు పున: ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థుల రవాణాకు వినియోగించే విద్యాసంస్థల బస్సులు తప్పనిసరిగా ఫిట్‌నెస్ కలిగి ఉండాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 11,922 విద్యా సంస్థల బస్సులు ఉంటే ఇప్పటి వరకు కేవలం 8,917 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాయన్నారు. మిగిలిన 3005 బస్సులు కూడా సంబంధిత రవాణా శాఖ కార్యాలయంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని తెలిపారు. 15 సంవత్సరాలు దాటిన విద్యాసంస్థల బస్సులు ఎట్టి పరిస్థితుల్లో రోడ్లపై తిరగరాదని, 15 సంవత్సరాలు దాటిన బస్సులు, ఫిట్‌నెస్ లేని బస్సుల్లో విద్యార్థులను రవాణా చేస్తే ఆ వాహనాలను సీజ్ చేయడమే కాకుండా యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బస్సు మంచి కండిషన్‌లో ఉంచడంతో పాటు అనుభవజ్ఞులైన, 60 సంవత్సరాలకు మించని డ్రైవర్లను నియమించుకోవాలని సూచించారు. ఇప్పటివరకు రంగారెడ్డి జిల్లాలో 5,725 బస్సులకు 4,363, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 5,985 బస్సులకు 4,468, వికారాబాద్ జిల్లాలో 212 బస్సులకు 86 బస్సులు ఫిట్‌నెస్ కలిగి ఉన్నాయన్నారు. అప్పటి వరకు ఎట్టి పరిస్థితులలో ఆ బస్సులను రోడ్లపై తిప్పరాదని తెలిపారు. త్వరలో విద్యాసంస్థల యాజమాన్యాలు, డ్రైవర్లతో సమావేశం నిర్వహిస్తామని చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు.



ధర్నా చేస్తున్న దేశీ గోవంశ రక్షణ సంవర్ధన సమితి సభ్యులు

గో సంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

రంగారెడ్డి అర్బన్, జూన్ 10 : గోసంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, గోవధకు కారణమవుతున్న వారిని కఠినంగా శిక్షించాలని సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద దేశీ గోవంశ రక్షణ సంవర్ధన సమితి సభ్యులు ధర్నా చేపట్టారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. చట్టాన్ని ఉల్లంఘించి గోవులను ఆటోలు, లారీల్లో కాకుండా క్లోజుడు కంటైనర్లలో అక్రమంగా రవాణా చేస్తున్నారని ఆరోపించారు. గేదలు, లేగ దూడలను వధిస్తున్నారని, ఆరోగ్యంగా ఉన్న పశువులను వధించకూడదని చట్టం చెబుతున్నా ఆ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని వారు ఆరోపించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా పెద్ద ఎత్తున పశువులను కబేళాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. జన సమూహాల మధ్య పశువుల ఎముకలతో నూనె, టీ పొడి లాంటివి తయారు చేసే కర్మాకారాలను ఏర్పాటు చేసి ప్రజా ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని తెలిపారు. ధర్నాలో దేశీ గోవంశ రక్షణ సంవర్ధన సమితి సభ్యులు పురుషోత్తంరెడ్డి, పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులు గుంతలమయం



- పూర్తిగా పాడైన చేగిరెడ్డి ఘణాపూర్-గుంజల్‌పహడ్ బీటీ రోడ్డు
- నిధులు మంజూరైనా ముందుకు సాగని పనులు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు

చౌదరిగూడ, జూన్ 10 : మండలంలోని పలు రహదారులు కంకర తేలి గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పాడైన రోడ్ల మరమ్మతులకు నోచుకోవడం లేదు. నిత్యం రద్దీగా ఉండే సింగిల్ రోడ్డుపై ఎక్కడో ఒక చోట నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ రోడ్డు మీదుగా ప్రజలు, వాహనదారులు మండల పరిధిలోని లాల్‌పహడ్, షాద్‌నగర్, పరిగి, హైదరాబాద్ పట్టణాలకే కాకుండా మండల కేంద్రాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రానికి వీరన్నపేట్, చింతకుంట తండా, జాకారం, గుంజల్‌పహడ్ గ్రామాల నుంచి మండల కేంద్రానికి రావాలంటేనే రోడ్డును చూసి ప్రజలు గుంతల్లో కిందపడి పోతామోనని భయాందోళనకు గురవుతున్నారు. లాల్‌పహడ్ నుంచి వికారాబాద్ జిల్లాలోని కంకల్‌కు వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా పాడైంది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాగా ఉన్నప్పుడు వేసిన బీటీ రోడ్డు నేటికీ మరమ్మతులకు నోచుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై కంకర కొట్టుకుపోయి గోతులుగా మారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆర్‌అండ్‌బీ పరిధిలోని ఈ రోడ్డు ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. అధికారులు సైతం ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఈ రోడ్డు 3కిలోమీటర్లు ఉమ్మడి వికారాబాద్ జిల్లాలో ఉన్నందున పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.



గుంతలమయంగా మారిన చేగిరెడ్డి-ఘణాపూర్ రోడ్డు

బీటీ రోడ్డు పనులు పూర్తయ్యేనా?

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనుల కోసం లాల్‌పహడ్ నుంచి చలివేంద్రంపల్లి, వీరన్నపేట్, పెద్దఎల్కిచర్ల, గాలిగూడ వరకు రోడ్డు విస్తరణ పనుల కోసం దాదాపు రూ.6.5కోట్ల నిధులు మంజూరు చేసింది. కానీ, రోడ్డు విస్తరణ పనులు లాల్‌పహడ్ నుంచి చౌదరిగూడ, జిల్లేడ్ వరకు మాత్రమే పూర్తయ్యాయి. పెద్ద ఎల్కిచర్ల నుంచి గాలిగూడ వరకు పనులు పూర్తి చేశారు. చెన్నారెడ్డి గూడ నుంచి చలివేంద్రంపల్లి వరకు, చేగిరెడ్డి ఘణాపూర్ నుంచి పెద్ద ఎల్కిచర్ల వరకు బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. బీటీ రోడ్డు నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచి పోయాయి. అక్కడక్కడ కల్వర్టులు నిర్మించి బీటీ రోడ్డు పనులు మధ్యలోనే వదిలేయడంతో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రోడ్డు నిర్మాణ పనులపై కాంగ్రెస్ ప్రభుత్వమైనా దృష్టి సారిస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు.

ఏళ్లకాలంగా తప్పని కష్టాలు



లాల్‌పహడ్ నుంచి కంకల్‌కు వెళ్లే బీటీ రోడ్డు పలుచోట్ల బీటీ తొలగిపోయి వాహనాలు నడపలేని దుస్థితి నెలకొంది. రాత్రి సమయాల్లో ఈ సింగిల్ రోడ్డు ద్వారా వెళ్లాలంటే ప్రమాదాలు కొనితెచ్చుకున్నట్లే. ప్రభుత్వం డబుల్ రోడ్డు వేయాలి.

- లింగంగారి మల్లారెడ్డి, వనంపల్లి, జిల్లేడ్ చౌదరిగూడ

ఎవరూ పట్టించుకోవడం లేదు



బీటీ రోడ్డు మరమ్మతుల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్నో సార్లు ప్రజాప్రతినిధులకు అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. వర్షాలకు బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. కంకర తేలి రోడ్డుపై ప్రయాణం చేయలేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం దృష్టి సారించి మరమ్మతులు చేపట్టాలి.

- కుమ్మరి హరీష్, వీరన్నపేట్, జిల్లేడ్ చౌదరిగూడ మండలం

దోర్నాల్ అడవిలో చెట్ల నరికివేత

- చదును చేసి విత్తనాలు వేసేందుకు యత్నం
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు


దోర్నాల్ అటవీ ప్రాంతంలో నరికిన చెట్లు

ధారూరు, జూన్ 10: ధారూరు అటవీ రేంజ్ పరిధిలోని దోర్నాల్ అటవీ బీట్‌లో అక్రమార్కులు విలువైన చెట్లను నరికివేశారు. శని, ఆది వారాలు సెలవులు కావటంతో అటవీ ప్రాంతంలోని చెట్లను రాత్రింబవళ్లు నరికి చదునుచేశారు. వర్షాలు పడితే దున్ని విత్తనంవేసి అటవీ భూమిని అక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. గత వేసవిలో సంగాయిపల్లి అటవీ ప్రాంతంలో ఎకరాల కొద్దీ అటవీ భూమిలోని చెట్లను నరికినా అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవటంతో అడివి నరికివేత కొనసాతూనే ఉంది. దోర్నాల్ అటవీ బీట్‌లో రెండు రోజుల నుంచి సమీప గ్రామాల వారు అడవిలోని పెద్ద,పెద్ద చెట్లను నరికివేశారు. చెట్ల పొదలను తొలగించారు. చదును చేసిన అటవీ భూమిలో వానాకాలంలో పంటలు సాగుచేసి అటవీ భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా సోమవారం ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజర్ అరుణ చెట్లను నరికివేసిన అటవీ ప్రాంతాన్ని పరిశీలించి వెళ్లారు. అడవిలో చెట్లు నరికిన వారిని గుర్తించి చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనుకంజ వేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమార్కులతో అటవీ అధికారులు కుమ్మక్కవడం వల్లే దర్జాగా అడవి ఆక్రమనకు గురవుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంగాయిపల్లి అడవిలో చెట్ల నరికివేతపై ఫ్లయింగ్‌స్క్వాడ్ డీఎఫ్‌వో, విజిలెన్స్ డీఎఫ్‌వో విచారణ జరిపినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం గమనార్హం.

వంద శాతం మొక్కలు నాటాలి

కులకచర్ల, జూన్ 10: వర్షాలు మొదలవగానే గ్రామాల్లో వంద శాతం మొక్కలు నాటాలని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. మండలంలోని అంతారం గ్రామంలో మొక్కలు నాటేందుకు రోడ్డు పక్కన తీస్తున్న గుంతలను ఆయన పరిశీలించారు. అమ్మ ఆదర్శ పథకంలో భాగంగా పాఠశాలల్లో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

బంగారు దుకాణం యజమాని మాయం!

- రూ.లక్షల్లో కుచ్చుటోపి పెట్టి ఉడాయించిన వ్యాపారి
- బాధితుల ఆందోళన.. పోలీసులకు ఫిర్యాదు


ధారూరులో తాళాలు వేసి ఉన్న బంగారు దుకాణం

ధారూరు, జూన్ 10: ధారూరులోని ఓ బంగారం దుకాణం యజమాని అద్దె ఇంటికి, దుకాణానికి తాళం వేసి మాయమయ్యాడు. చాలాకాలంగా బంగారం దుకాణం నడుపుతున్న యజమాని అందరిని నమ్మించి బంగారం తనఖాలు పెట్టుకుని, బంగారం నగల కోసం అడ్వాన్సు డబ్బులు తీసుకుని, వ్యాపారం కోసం అప్పులు చేసి ఉడాయించటంతో సోమవారం బాధితులు ఆందోళనకు దిగారు. మోసపోయిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. గుజరాత్ రాష్ట్రానికి చెందిన దీపక్ వైష్ణవ్ ధారూరులో చాలా కాలంగా బంగారు దుకాణం నడిపిస్తూ పాన్ బ్రోకర్‌గా వ్యాపారం చేస్తున్నాడు. కాగా దీపక్ వ్యాపారంపై నమ్మకం కుదిరిన వారు బంగారం తనఖా పెట్టి డబ్బులు అప్పులు తీసుకున్నారు. కొంత మంది బంగారు నగల కోసం డబ్బులు అడ్వాన్సుగా చెల్లించారు. మరి కొంతమంది వ్యాపారం కోసం రూ.లక్షలు అప్పుగా ఇచ్చారు. దీపక్ వారం రోజులు క్రితం తిరుపతికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగిరాకపోగా, ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. వారం రోజులుగా బంగారు దుకాణానికి తిరుగుతున్న వినియోగదారులకు దుకాణం తాళం వేసి ఉండటంతో ఆందోళనకు గురయ్యారు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుంది. దీంతో బాధితులు సోమవారం దీపక్ దుకాణం ముందు ఆందోళనకు దిగారు. ఎదురుగా ఉన్న బంగారు దుకాణానికి వెళ్లి యజమానితో బాధితులు వాదనకు దిగారు. దీపక్ ఎక్కడికి వెళ్లాడో, ఎక్కడ ఉన్నాడో చెప్పాలని , దీపక్ అడ్రస్ నీకే తెలుసంటూ ఆయనను నిలదీశారు. కాగా దీపక్ తన వద్ద రూ.11.80లక్షలు అప్పుతో పాటు బంగారు కోసం రూ.3లక్షలు నగదు ఇచ్చానని, అప్పు తీసుకున్న డబ్బులు, బంగారం డబ్బులు ఇంతవరకు ఇవ్వలేదని, అద్దె ఇంటికి, బంగారు దుకాణానికి వెళ్లగా తాళాలు వేసి ఉందని, మండల పరిధిలోని రాంపూర్ తండాకు చెందిన రవినాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగసమందర్ గ్రామానికి చెందిన అగ్గనూరి వీరేశం బంగారం కోసం రూ. 10 లక్షలు నగదు ఇచ్చానని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంగారం కోసం అడ్వాన్సుగా రూ. 2.30 లక్షలు దీపక్‌కు ఇచ్చానని ధారూరుకు చెందిన చాకలిపాండు చెప్పారు. కాగా తనఖా పెట్టిన బంగారం, బంగారానికి నగదు తీసుకున్న డబ్బుల విలువ రూ. లక్షల్లో ఉంటుందని బాధితులు తెలిపారు. బంగారం తనఖా పెట్టి అప్పులు తీసుకున్న వారు, అప్పులు చెల్లించిన వారి బంగారం వాపస్ ఇవ్వలేదని, తమను మోసం చేసి ఉడాయించిన బంగారం వ్యాపారి దీపక్ వైష్ణవ్ పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు.


ఎదురుగా ఉన్న బంగారు దుకాణం యజమానిని నిలదీస్తున్న బాధితులు


విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్, నర్సింహ, శ్రీను

ప్రవీణ్‌కుమార్‌కు అసంబద్ధ ఆరోపణలు తగదు

ఆమనగల్లు, జూన్ 10: గోవిందాయిపల్లికి చెందిన గుండెమోని శివగౌడ్, శేషగారి శివగౌడ్‌ల హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు కండె హరిప్రసాద్, బీజేపీ కల్వకుర్తి నియోజకవర్గ కోకన్వీనర్ గోరటి నర్సింహ, మండల ప్రధాన కార్యదర్శి శ్రీను కోరారు. హత్యా రాజకీయాలను పార్టీ ఉపేక్షించదన్నారు. ఆమనగల్లులో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కడ్తాల బటర్ ఫ్లై సిటీలో గల ఓ ఇంట్లో జరిగిన ఇద్దరి హత్యలపై విచారణ జరిపించి నిందితులను శిక్షించాలన్నారు. హత్యలు చేసిన జల్కం రవికి, బీజేపీ నేత ఆచారితో సంబంధాలున్నాయని, హత్య వెనుక బీజేపీ నేతల పాత్ర ఉందా? అనే కోణంలో పోలీసు విచారణ జరపాలని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నిరాధార, అసంబద్ధ ఆరోపణలు చేయడం తగదన్నారు. 40ఏళ్లుగా ఆచారి ప్రజా సమస్యలపై పనిచేస్తున్నారని గుర్తు చేశారు. యువకుల హత్య వెనుక ఎవరి ప్రమేయం ఉన్నా వారికి శిక్ష పడాల్సిందేనన్నారు. సమావేశంలో నాయకులు నాజర్, మహేష్‌గౌడ్‌లు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

ఆమనగల్లు, జూన్ 10: ఆమనగల్లుకు చెందిన శృతిలయ కల్చరల్ అకాడమీ విద్యార్థులు సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతీలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్‌లో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై 230మంది విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా శృతిలయ అకాడమీకి చెందిన 120మంది విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ప్రదర్శించారు. అకాడమీ విద్యార్థులను సీఎం అభినందించారు. కార్యక్రమంలో కల్చరల్ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్‌దాస్, ప్రధానకార్యదర్శి విజయ్‌కుమార్, సభ్యులు అభినవ్‌రెడ్డి, ధనలక్ష్మి, వసంత, శ్రీశైలం, గోపి పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు మెరుగైన వసతులు కల్పించాం


హజ్ యాత్రికులకు సెండాఫ్ చెబుతున్న హజ్ కమిటీ చైర్మన్ పాషా

శంషాబాద్ రూరల్, జూన్ 10 : హజ్ యాత్రికులకు మెరుగైన వసతులు కల్పించామని తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ కుస్రో పాషా అన్నారు. సోమవారం శంషాబాద్ విమానాశ్రయంలో హజ్ యాత్రికులకు ఆయన సెండాఫ్ చెప్పారు. అనంతరం మాట్లాడుతూ... రుమోసియా టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో కడప నుంచి 50మంది యాత్రికులు బయలుదేరి వెళ్లారన్నారు. యాత్రికులకు భోజన, గృహ వసతి కల్పించామని తెలిపారు. ఈ యాత్ర నెల రోజులు ఉంటుందని చెప్పారు. యాత్రీకులు పర్యాటక కేంద్రాలను సందర్శిస్తారని చెప్పారు.

ప్లే గ్రౌండ్ ప్రభుత్వ స్థలమే

- మరోసారి తేల్చిన రెవెన్యూ అధికారులు
- ఈ స్థలంలోకి వస్తే క్రిమినల్ కేసులే : ఆర్డీవో
- ఎమ్మెల్యే, ఆర్డీవోకు అభినందనల వెల్లువ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, జూన్ 10: తాండూరు పట్టణం విజయ విద్యాలయ పక్కన గల ప్లేగ్రౌండ్‌గా వాడుతున్న స్థలం ప్రభుత్వ స్థలమేనంటూ రెవెన్యూ అధికారులు మరోసారి తేల్చారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్‌రావు స్పందించారు. తహసీల్దార్ తారాసింగ్, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఆర్ఐ బాల్‌రాజ్, సర్వేయర్ శ్రీహరి, సర్వే నంబర్ 111లో గల విజయ విద్యాలయ ప్లే గ్రౌండ్ స్థలాన్ని సోమవారం సర్వేచేశారు. ఎట్టకేలకు ఇది ప్రభుత్వ భూమేనని మరోసారి రెవెన్యూ అధికారులు తేల్చారు. 111 సర్వే నంబర్‌లో 14 ఎకరాల్లో ప్లేగ్రౌండ్ ఖాళీస్థలం 16గుంటలు కూడా ప్రభుత్వానిదేనని రెవెన్యూ అధికారులు తేల్చారు. ఈ స్థలం అన్యాక్రాంతం కాకుండా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్ రావు చొరవ చూపడంతో పలువురు స్థానికులు అభినందించారు. ఈ స్థలంలో రెవెన్యూ స్థలం బోర్డును మంగళవారం ఏర్పాటు చేస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు. కొందరు వ్యక్తులు తమ స్థలమంటూ పాతిన బోర్డును తొలగిస్తామని తెలిపారు.


విజయ విద్యాలయ హైస్కూల్ పక్కన ఖాళీస్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు



ఇది మా పెద్దల ఆస్తి

ఇది మా పెద్దల ఆస్తి. 1945 నుంచి మా తాత పట్టాదారుడని పసారం శశాంక్, బస్వరాజ్ పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు మా వాదనలు వినడం లేదు. విజయ విద్యాలయ స్థలం మాదే. మాకూ కోర్టు నుంచి ఆర్డర్ ఉంది. గతంలో విజయ విద్యాలయ హైస్కూల్ ఏర్పాటు చేసేందుకు స్థలం ఇచ్చాం. ఖాళీగా ఉన్న స్థలం మాదే.

\- పసారం బస్వరాజ్, శశాంక్

ఈస్థలంలోకి వస్తే క్రిమినల్ చర్యలు : ఆర్డీవో

విజయ విద్యాలయ హైస్కూల్ పక్కన ఖాళీ స్థలం 16గుంటలు ప్రభుత్వ స్థలమే. ఈ స్థలంలో ఎవరైనా తమదేనని జోక్యం చేసుకుంటే క్రిమినల్ కేసులు పెడుతాం. ఈ స్థలంపై రెవెన్యూ బృందంతో సోమవారం సర్వేచేయించామని పాత రికార్డులనూ పరిశీలించి ప్రభుత్వ స్థలమేనని నిర్ధారించాం. ఈ స్థలం అన్యాక్రాంతం కాకుండా రక్షిస్తామని తెలిపారు.


డీజీపీకి ఫిర్యాదు చేసి మాట్లాడుతున్న దళితులు

పరిగి డీఎస్పీపై డీజీపీకి ఫిర్యాదు

పరిగి, జూన్ 10: దళితులపై దాడులు చేసి, కులం పేరుతో దూషించిన వారిని వెంటనే అరెస్ట్ చేయడంలో పరిగి డీఎస్పీ నిర్లక్ష్యం చేస్తున్నారని పరిగి మండలం రుకుంపల్లి గ్రామ దళితులు ఆరోపించారు. నగరంలోని డీజీపీని సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం దళిత సంఘం నాయకులు మొగులయ్య, మాణిక్యం, వెంకటయ్య, చంద్రయ్య, శ్రీనివాస్‌లు మాట్లాడారు. గతనెల ఏప్రిల్ 28న గ్రామంలో పోచమ్మ బోనాల గుడి దగ్గర దళితులకు చెందిన సౌండ్ బాక్స్‌లు అద్దెకు పెట్టినట్లు తెలిపారు. బోనాల ఉత్సవం పూర్తి కాగానే సాయంత్రం సౌండ్‌బాక్స్‌లు తీసుకురావడానికి వెళ్లిన మొగులయ్య, తదితరులను గ్రామానికి చెందిన హన్మంత్, సురేష్, కృష్ణలు కలిసి కులం పేరుతో దూషించారని, దళితబంధు కింద ఇప్పించాం కదా ఉచితంగా పెట్టాలని డిమాండ్ చేసి గొడవ పడ్డారని తెలిపారు. అదే రోజు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్ట్ చేయించడంలో నిర్లక్ష్యం చేస్తున్న పరిగి డీఎస్పీపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.


ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి గోడు వెళ్లబోసుకుంటున్న గిరిజనులు

ఆక్రమణ నుంచి భూమి కాపాడాలని ఎమ్మెల్యేకు మొర

యాచారం, జూన్ 10: మంతన్‌గౌరెల్లిలో సర్వే నంబర్ 71, 72లలోని 4ఎకరాల 16గుంటల భూమిని బిల్ల అనే వ్యక్తి ఆక్రమించి దాడులు చేస్తున్నాడని సోమవారం మండల పరిధి మంతన్‌గౌరెల్లికి చెందిన బిక్కు,జ్యోతి దంపతులు నగరంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఆయన నివాసంలో కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. తమకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా వారిని అరెస్టు చేయలేదన్నారు. పోలీస్‌స్టేషన్ వద్ద ఆత్మహత్యాయత్నం చేసినా పట్టించుకోవడం లేదని విలపించారు. న్యాయం చేస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వి.తిరుమలేష్, గోపాల్, మోహన్, గోపి, కోట, సోమ్లా, ఎం.నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా ఏమైంది?

- సాగుకు పనికి రాని 'భరోసా' ఎందుకు? : సబితారెడ్డి

కందుకూరు, జూన్ 10 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న రైతు భరోసా ఏమైందని, అదునుదాటిన తరువాత రైతులకు పనికిరాని భరోసా ఇచ్చినా ప్రయోజనం ఏమిటని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం కందుకూరులో బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల మాజీ సీఎం కేసీఆర్ రైతులకు, రైతు కూలీలకు, ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. తాము ప్రభుత్వంలోకి వస్తే రైతులకు ఎకరానికి ఏడాదికి రూ.15వేల చొప్పున ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. అమల్లో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం తప్ప ఆరు గ్యారెంటీలేవీ అమలుచేయడం లేదన్నారు. ఈ విషయంపై రైతులు, రైతు కూలీలు, ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. వెంటనే రైతు భరోసాను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు ఎస్.శేఖర్‌రెడ్డి, అనంద్, నాయకులు మన్నె జయేందర్, దశరథ్, సుదర్శన్ రెడ్డి, తాళ్ల కార్తీక్, హన్మంతరెడ్డి, వెంకటేష్, రాజేందర్‌రెడ్డి, సుగుణాకర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ప్రమాదకరంగా చెరువుకట్ట

బషీరాబాద్, జూన్ 9: దామర్‌చెడ్-వాల్యానాయక్ తండాకు వెళ్లే మార్గంలో చెరువు కట్టపై నిర్మించిన తారు రోడ్డు పలుచోట్ల ధ్వంసమైంది. ఈ ప్రాంతంలో కొంతదూరం సీసీ రోడ్డును కూడా నిర్మించగా ఎగుడుదిగుడుగా కుంగిపోయి ప్రమాదకరంగా తయారైంది. దీంతో బైక్ పై వెళ్లేవారు ఎక్కడ ప్రమాదం సంభవిస్తుందోనని భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. చెరువు కట్టపై పలుచోట్ల తారు రోడ్డు ధ్వంసమై గుంతలుగా మారడంతో వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై రాత్రి వేళల్లో వాహనాలపై వెళ్లాలంటే గిరిజన ప్రజలు మరింత జంకుతున్నారు. సంబంధిత అధికారులు ఈ రోడ్డు మరమ్మతుకు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


ఊరచెరువు కట్టపై రోడ్డు ఇలా

56 కేజీల గంజాయి పట్టివేత

వికారాబాద్, జూన్ 10: భారీగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని అతని వద్ద గంజాయి స్వాధీనం చేసుకున్న సంఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో రైల్వే పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. విశాఖపట్నం నుంచి ముంబాయి వెళుతున్న ఎల్‌టీటీ రైలులో సాయంత్రం పలాసాకు చెందిన ఓ వ్యక్తి 56 కేజీల గంజాయితో వికారాబాద్ స్టేషన్‌లో దిగాడు. రైలు గంట ఆలస్యంగా రావడం అదే సమయంలో రైల్వే పోలీసులు తనిఖీలు చేయగా అతని వద్ద భారీ మొత్తంలో గంజాయిని గుర్తించారు. ఆ సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఇందుకు సంబంధించి బుధవారం పోలీసులు పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది. అయితే ఈ మధ్య కాలంలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి భారీగా తరలిస్తున్నారు. అయితే వికారాబాద్ జంక్షన్ కావడంతో ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు రైలు సౌకర్యం ఉండడంతో వికారాబాద్ కేంద్రంగా గంజాయి అక్రమ రవాణా కొనసాగిస్తున్నట్లుగా తెలుస్తోంది.


మూడుచింతలపల్లి మండలంలో విత్తనాల దుకాణాలను అకస్మికంగా తనిఖీ చేస్తున్న ఏడిఏ వెంకట్రాంరెడ్డి

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- మేడ్చల్ జిల్లా ఏడీఏ వెంకట్రాంరెడ్డి

మూడుచింతలపల్లి, జూన్ 10: రైతులకు నకిలీ విత్తనాలు, గడువు దాటిన విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ అధికారి మేడ్చల్ ఏడీఏ వెంకట్రాంరెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించి వెంటనే బిల్లులు ఇవ్వాలని దుకాణదారులకు సూచించారు. రైతులు పంటకాలం పూర్తయ్యే వరకు బిల్లులు, విత్తనాల సంచిని భద్రపరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ యాదగిరి, సీడ్ సర్టిఫికేషన్ అధికారి మహేష్, మండల వ్యవసాయాధికారి కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

నాటుడు.. నరుకుడు!

- ఇదేం పనని మండిపడుతున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న అటవీ శాఖ అధికారులు


కమ్మెట రోడ్డు పక్కన నరికిన చెట్లు

చేవెళ్ల, జూన్ 10 : పచ్చని చెట్లు-ప్రగతి మెట్లు అని ప్రభుత్వం వేల కోట్లు వెచ్చించి ఏటా రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి పెంచుతోంది. అయితే విద్యుత్ వైర్లకు వైర్లు తాకుతున్నాయని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా పెద్దపెద్ద చెట్లను నరికేస్తున్నారు. చేవెళ్ల మండలం కమ్మెట చౌరస్తా నుంచి చిలుకూరు రోడ్డులో రెండేళ్లుగా మొక్కలు పెంచుతున్నారు. ఈ చెట్లు వాహనదారులకు, బాటసారులకు నీడనిస్తున్నాయి. చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లకు తగులుతున్నాయని రెండు రోజులుగా విద్యుత్ అధికారులు ఎక్స్‌కవేటర్లతో చెట్లను తొలగిస్తున్నారు. ఇది చూస్తూ ప్రజలు, వాహనదారులు విద్యుత్ శాఖ తీరుపై మండిపడుతున్నారు. రోడ్ల పక్కన, వైర్ల కింద మొక్కలు నాటడం ఎందుకు? మళ్లా నరికేయడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. మొక్కలు వృక్షాలైన సమయంలో కొట్టేస్తే మరి నాటడం ఎందుకంటున్నారు. విద్యుత్ స్తంభాలు లేని చోటే నాటాలన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చెట్లను తొలగించకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉంటే చెట్ల నరికివేతపై అటవీ శాఖ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. రైతులు తమ అవసరాలకు పొలాల్లోని చెట్లు నరికితే ఆక్షేపించే అధికారులు ఇప్పుడెందుకు పట్టించుకోవడంలేదో తెలియడం లేదు.

ఉన్నతాధికారులు స్పందించాలి



ప్రభుత్వం నాటించిన మొక్కలు పెరిగాక నరికివేయడం బాధాకరం. విద్యుత్ స్తంభాలు చిన్నగా ఉండటం వల్లే కొమ్మలు వైర్లకు తగులుతున్నాయి. రోడ్డు వెంట పొడవైన విద్యుత్ స్తంభాలు పాతితే కొన్నేళ్ల వరకు చెట్ల నరికివేత ఉండదు. ఉన్నతాధికారులు స్పందించి చెట్లు నరివేతను ఆపేయించాలి. చెట్లను పరిరక్షించాల్సిన యంత్రాంగం స్పందించకపోవడం సరికాదు. చెట్లు ఉంటేనే ప్రజలకు, పర్యావరణానికి మేలు.

\- హన్మంతరెడ్డి, మాజీ సర్పంచ్, కమ్మెట

బస్సు కోసం ఆరు గంటలు నిరీక్షణ

- రోడ్డుపైకి వచ్చి మహిళా ప్రయాణికుల నిరసన
- రంగంలోకి పోలీసులు

తాండూరు, జూన్ 10: తాండూరు నుంచి మహబూబ్ నగర్‌కు ప్రతీ అరగంటకు ఒకసారి తాండూరు డిపో నుంచి వెళ్లే ఆర్టీసీ బస్సులు సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 6 గంటల వరకూ రాకపోవడంతో మహిళా ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బస్టాండ్ నుంచి రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారు. సుమారు అరగంట పాటు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని మహిళలను సముదాయించి బస్టాండ్‌లోకి తీసుకొచ్చారు. అనంతరం ఎట్టకేలకు ఆర్టీసీ అధికారులు మహబూబ్‌నగర్‌కు ఒకే బస్సు ఏర్పాటు చేయడంతో బస్సులో ఎక్కేందుకు మహిళల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు అక్కడ మహిళలను దగ్గరుండి బస్సులోకి ఎక్కించారు.


నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా ప్రయాణికులు

ఉపాధి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

షాద్‌నగర్‌రూరల్, జూన్ 10 : ఉపాధి హామీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం షాద్‌నగర్ నాయకులు సోమవారం మంత్రి సీతక్కకు వినతి ఇచ్చారు. కొత్త పంచాయతీలకు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని కోరారు. గతంలో అకారణంగా ఫీల్డ్ అసిస్టెంట్లను బీఆర్ఎస్ ప్రభుత్వం తొలగించిందని, వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. సీనియర్ మేట్లను ఫీల్డ్ అసిస్టెట్లుగా గుర్తించాలని తెలిపారు. కూలీలకు 200 రోజుల పనిచ్చి కొలతలు లేకుండా రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనునాయక్, ఆంజనేయులు, శంకర్, జంగయ్య, మల్లేష్, రమేష్, రాజు ఉన్నారు.


మంత్రికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించేందుకు కృషి


షాద్‌నగర్ రూరల్: దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ రూరల్, జూన్ 10: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సౌకర్యాల కల్పనకు కృషిచేస్తానని, ఉపాధ్యాయులు కూడ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు పాటుపడాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం డ్వాక్రా భవనంలో ఫరూఖ్‌నగర్ మండల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులనే ఆయన అందజేశారు. ప్రైవేటుకు ధీటుగా ఉత్తీర్ణత సాధించాలన్నారు. మండలానికి 18 వేల డ్రెస్సులు కావాల్సి ఉండగా 9వేల యూనిఫామ్‌లు వచ్చాయని చెప్పారు. త్వరలో అవసరమైనన్ని డ్రెస్సులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్‌రాథోడ్, ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలు రాధాకృష్ణ, బాలరాజు, వెంకటరమణ, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫారమ్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల మహిళా సమాఖ్య భవనంలో ఏపీఎం వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎంఈవో సర్దార్‌నాయక్ హాజరయ్యారు. తొలి విడత 16పాఠశాలల విద్యార్థులు 473 మందికి డ్రెస్సులు పంపిణీ చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్ ఇస్తామని, ఇప్పటికే పుస్తకాల పంపిణీ చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీలత, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శోభ, కోశాధికారి నిర్మల, టీచర్లు కాశీరావు, సుదర్శన్ రెడ్డి, ఐకేపీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లు: యూనిఫామ్స్‌ను అందజేస్తున్న అధికారులు

పాత ఆస్పత్రి భవనం తొలగింపు పనులు ప్రారంభం


యంత్రాలతో కొనసాగుతున్న పాత భవనం తొలగింపు

ఆమనగల్లు, జూన్ 10 : ఆమనగల్లులోని ప్రభుత్వ ఆస్పత్రి పాత భవనం తొలగింపు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. పట్టణానికి 50పడకల ఆసుపత్రి మంజూరైంది. భవన నిర్మాణానికి ప్రభుత్వం వైద్య విధాన పరిషత్ ద్వారా రూ.17.5కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతమున్న స్థలంలోనే నూతన ఆస్పత్రిని నిర్మిస్తారు. వైద్య సేవలను తాత్కాలికంగా హోమియోపతి ఆస్పత్రిలో అందిస్తారు. వారం రోజుల్లో పాత భవనం తొలగింపు పనులు పూర్తిచేసి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. భవన నిర్మాణానికి కాంట్రాక్టర్ ఇప్పటికే మెటీరియల్ డంప్ చేశారు.

రోడ్డు వెడల్పు పనులు షురూ


చేపడుతున్న రోడ్డు వెడల్పు పనులు

ఆమనగల్లు, జూన్ 10 : ఆమనగల్లులో షాద్‌నగర్-మాడ్గుల రోడ్డు విస్తరణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. మూడేళ్ల క్రితం రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే సురసముద్రం చెరువు వద్ద వంతెన, సీసీ రోడ్డు నిర్మించారు. ఆ పనులు తుది దశకు చేరుకోవడంతో రాజీవ్‌గాంధీ చౌరస్తా నుంచి సందబాయి వరకు రోడ్డు పనులకు ఆర్అండ్‌బీ అధికారులు శ్రీకారం చుట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరువ్యాపారుల దుకాణాలను తొలగించారు. ఆర్అండ్‌బీ డీఈ రవీంద్ర కుమార్ పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి.

ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య


విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరుతున్న ఎంపీపీ సుకన్య, ఉపాధ్యాయులు

యాచారం/మాడ్గుల/ఆమనగల్లు, జూన్ 10: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని యాచారం ఎంపీపీ కొప్పుసుకన్య, ఇన్‌చార్జి ఎంఈ వో వెంకటరెడ్డి కోరారు. సోమవారం యాచారంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ బడిలో చేర్పించాలని కరపత్రాలు పంపిణీ చేశారు. పిల్లలకు పాఠ్యపుస్తకాలను అందించారు. సర్కార్ బడిలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, స్నాక్స్, స్కూల్ డ్రెస్సులు, పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం ఇస్తోందని తెలిపారు. అలాగే మాడ్గుల మండలం నల్లచెర్వులో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం ఓంకారేశ్వర్‌రెడ్డి, పిల్లలు బ్యానర్ పట్టుకొని ర్యాలీ తీశారు. ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ప్రైవేట్‌లో చేర్పించి ఫీజుల భారాన్ని మోయొద్దని ఆయన సూచించారు. ఆమనగల్లులోని గుర్రంగుట్ట కాలనీలో ఎంఈవో సర్దార్‌నాయక్ ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కాలనీలో ఇంటింటికి తిరిగి బడిఈడు బడిబయటి పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీచర్లు, సీఆర్పీలు మమత, శ్రీలత, కిషన్, అహ్మద్ పాల్గొన్నారు. గేటు తాండాలోనూ బడిబాట నిర్వహించారు.

గిరికొత్తపల్లికి బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

మాడ్గుల, జూన్ 10: మాడ్గుల మండల ప్రజలు మాల్ మీదుగా హైదరాబాద్‌కు పనుల కోసం పోతూ వస్తుంటారు. సాయంత్రం 6 అయ్యిందంటే మాల్ నుంచి బస్సులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో హైదరాబాద్ నుంచి మాల్ మీదుగా గిరికొత్తపల్లికి నైట్‌హాల్ట్ సర్వీసు ఉండేది. కొన్ని నెలల క్రితం ఆ బస్సును రద్దు చేయంటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మాడ్గుల ఎంపీ టీసీ కొత్త పాండుగౌడ్ అన్నారు. హైదరాబాద్ నుంచి చెర్కుపల్లి బస్సు సర్వీసు మాల్ నుంచి 4గంటలకు బయలుదేరి కొల్లుకపల్లి, నర్సాయపల్లి, మాడ్గుల మీదుగ నల్లచెర్వు, బ్రాహ్మణపల్లి, ఇర్విన్ మీదుగా చెర్కుపల్లికి చేరుతుందన్నారు. రాత్రి సమయంలో మాడ్గులకు ఈ ఒక్క సర్వీసే ఉండటంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో అధికారులు స్పందించి వెంటనే గిరికొత్తపల్లి బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ఎంపీటీసీ కోరారు.


బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

ఎరువులు, విత్తనాల కొరత రాకుండా చూడాలి


ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏవో వెంకటేశం

షాబాద్/అమనగల్, జూన్ 10: ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు ఎరువులు, విత్తనాల కొరత రాకుండా చూడాలని షాబాద్ ఏవో వెంకటేశం అన్నారు. సోమవారం షాబాద్, నాగర్‌గూడలో ఎరువుల షాపుల్లో తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవన్నారు. రైతులకు విత్తన కొరత రాకుండా నిల్వలు ఉంచాలని, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మితే ఆ డీలర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అమనగల్‌లో ఏవో అరుణకుమారి ఎరువులు, విత్తన దుకాణాలను తనిఖీ నిర్వహించారు. రికార్డులు, విత్తనాలను పరిశీలించారు. రైతులకు రసీదు ఇవ్వాలన్నారు. ఈ-పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాల న్నారు. డీలర్లు చంద్రశేఖర్, రవి, జంగయ్య, సురేష్, వెంకటయ్య, రాజు, అయోధ్య పాల్గొన్నారు.

జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు, జూన్ 10: మందుకూరుకు చెందిన బీఆర్ఎస్ నేత ఎస్.దర్శన్‌రెడ్డి మనుమరాలి జన్మదిన వేడుకలకు మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి హాజరయ్యారు. సోమవారం కడ్తాల మండలం మైసిగండి ఆలయ ఆవరణలో దర్శన్‌రెడ్డి కుమారుడు విలాస్‌రెడ్డి-సమమీక్ష దంపతుల కూతురు మొదటి జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మాజీ చైర్మన్ వరలక్ష్మి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, డైరెక్టర్లు ఎస్.శేఖర్‌రెడ్డి, ఆనంద్, వెంకట్రామ్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు దశరథ్, అమరేందర్‌రెడ్డి, వెంకేటేశ్, క్రిష్టారెడ్డి, అంజిరెడ్డి, కొండల్‌రెడ్డి, పాండు, జగన్, సుధాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


జన్మదిన వేడుకల్లో పాల్గొన్న్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి తదితరులు

బీజేపీ విజయోత్సవాలు

తలకొండపల్లి, జూన్ 10: ప్రధానిగా మోదీ మూడోసారి బాధ్యతలు చేపట్టడాన్ని హర్షిస్తూ తలకొండపల్లిలో సోమవారం సంబరాలు జరుపుకున్నారు. బీజేవైఎం కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి పద్మఅనిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో బీజేపీ బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

'తీగల'కు చల్లా నర్సింహారెడ్డి శుభాకాంక్షలు

రంగారెడ్డి అర్బన్, జూన్ 10 : మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం టీకేఆర్ కాలేజీలో ఘన ంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి కృష్ణారెడ్డిని పూలు, శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


తీగల కృష్ణారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

ఆటా వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, జూన్ 10 : గత కొద్ది రోజులుగా అమెరికాలోని అట్లంటా నగరం జార్జ్ వరల్డ్ కాంగ్రెస్ సెంటర్ కమిటీ హాల్‌లో అమెరికా తెలుగు అసోసియేషన్ 18వ వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొన్నారు. వేడుకల్లో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు తదితరులతో కలిసి యాదయ్య పాల్గొన్నారు.


అమెరికాలో జరిగిన సభలో పాల్గొన్న ఎమ్మెల్యే యాదయ్య, మంత్రి శ్రీధర్‌బాబు

నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి

శంషాబాద్, జూన్ 10: శంషాబాద్‌లో నిర్మితమవుతున్న మున్సిపల్ కార్యాలయం భవనంతో పాటు 14వ వార్డులో నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అధికారులకు సూచించారు. సోమవారం ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డితో కలసి భవనం నిర్మాణ పనులను, 14వ వార్డులో నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యత చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బండిగోపాల్‌యాదవ్, కోఆప్షన్ మెంబర్లు, కౌన్సిలర్లు, స్థానికులు పాల్గొన్నారు.


మున్సిపల్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

జేఈఈ అడ్వాన్స్‌లో ర్యాంక్ సాధించిన విద్యార్థి


రోహిత్‌రెడ్డిని అభినందిస్తున్న తల్లిదండ్రులు

శంకర్‌పల్లి జూన్ 10: జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో శంకర్‌పల్లి పరిధి సింగాపురానికి చెందిన మర్రి రోహిత్‌రెడ్డి సత్తా చాటాడు. జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాల్లో రోహిత్‌రెడ్డి జాతీయ స్థాయిలో 2,672 ర్యాంక్ సాధించాడు. హైదర్‌నగర్‌లోని శ్రీ చైతన్య ప్రతిభ కళాశాలలో ఇంటర్మీడియెట్ పూర్తిచేసి జేఈఈ రాశాడు. ఇంటర్మీడియెట్‌లో 978 మార్కులు సాధించాడు. పేరొందిన విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్ చదివేలా తమ కుమారుడు ర్యాంక్ సాధించడంపై తల్లిదండ్రులు వరలక్ష్మి-అంజిరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు స్వీట్లు తినిపించి ఆనందం వ్యక్తం చేశారు.

నారాయణ బొంగ్లూర్ బ్రాంచ్ విద్యార్థికి జేఈఈ అడ్వాన్స్‌లో 27వ ర్యాంక్



ఆదిభట్ల, జూన్ 10: రంగారెడ్డి జిల్లా నారాయణ బొంగ్లూర్ బ్రాంచ్ విద్యార్థి ఎస్.లోకేష్ ఒఒఒ అడ్వాన్స్ ఫలితాల్లో 27వ ర్యాంక్ సాధించాడు. ఎస్టీ కేటగిరీలో విద్యార్థి ఈ ర్యాంక్ సాధించాడని కళాశాల ప్రిన్సిపల్ వి.రామేశ్వర్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా లోకేష్‌ను కళాశాల డీన్ రామలింగారెడ్డి, ఏజీఎం నంద్యాల శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డిలు పూల బొకే అందజేసి అభినందించారు.

మేడిపల్లి స్కూలు పనులు ఎక్కడికక్కడే!

- రేపు పాఠశాలలు పునః ప్రారంభం
- పట్టింపులేని అధికారులు ప్రజాప్రతినిధులు


తరగతి గది నుంచి తీసి పాఠశాల ఆవరణలో పడేసిన బండలు

యాచారం, జూన్ 10 : వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ఈ నెల 12న బుధవారం తెరచుకోనున్నాయి. అయితే మండలంలోని చాలా పాఠశాలల దుస్థితి దారుణంగా ఉంది. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు సగమైనా కాలేదు. మేడిపల్లి ఉన్నత పాఠశాలను అమెజాన్ సంస్థ దత్తత తీసుకుంది. 12గదుల్లో షాబాద్ బండలను కాంట్రాక్టర్ తొలగించి సిమెంట్ ఫ్లోరింగ్ పనులు నత్తనడకన చేస్తున్నారు. బ్లాక్‌బోర్డు పనులు చేయలేదు. మూత్రశాలకు తలుపుల్లేవు. ఈ పనుల పూర్తికి మరో పది రోజుల సమయం పడుతుంది. తరగతి పక్కనే గ్రామంలోని మురుగునీటి గుంత జమైంది. 1976లో నిర్మించిన గదులు శిథిలావస్థకు చేరాయి. అమెజాన్ సంస్థ నిర్లక్ష్యంతోనే పనులు ముందుకు సాగడం లేదని గ్రామస్తులు అంటున్నారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేయిస్తామని ఇన్‌చార్జి ఎంఈవో వెంకటరెడ్డి చెప్పారు. తాను పనులను నిత్యం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

'సామాజిక సేవల్లో లయన్స్ క్లబ్ ఖ్యాతి'

కడ్తాల్ , జూన్ 10: సామాజిక సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ అంతర్జాతీయ ఖ్యాతి గడించిందని క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి.చెన్న కిషన్‌రెడ్డి అన్నారు. కడ్తాల్‌లో సోమవారం లయన్ జి.సుధ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో అన్నదానాన్ని కిషన్‌రెడ్డి ప్రారంభించారు. 500మందికి అన్నదానం చేశారు. సేవా కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలుపంచుకోవాలన్నారు. క్లబ్ సేవలను యేటేటా గ్రామాలకు విస్తరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కడ్తాల్ మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, ప్యాక్స్ డైరెక్టర్ వెంకటేష్, బీసీ సంఘం అధ్యక్షుడు వెంకటేష్, బీజేపీ నాయకుడు మహేష్ తదితరులు ఉన్నారు.

రైతులకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలి : ఎంపీపీ

కొత్తూర్, జూన్ 10: ప్రస్తుత వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎంపీపీ పి.మధుసూదన్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల అధికారుల సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. ప్రస్తుత సీజలో రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కల్గకుండా అధికారులు చర్యలు తీసుకుని అందుబాటులో ఉండాలని కోరారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. నకిలీ విత్తనాలపై వ్యవసాయాధికారులు రైతులకు తగు సూచనలు, సలహాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతీ, ట్రాన్స్‌కో ఏఈ సాయికృష్ణ, వ్యవసాయాధికారి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.


అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

కేంద్ర మంత్రి సంజయ్‌కి వేణుగోపాల్ సన్మానం


బండి సంజయ్‌ని సన్మానిస్తున్న బుక్క వేణుగోపాల్

శంషాబాద్ రూరల్, జూన్ 10: కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన బండి సంజయ్‌ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపా ల్ సోమవారం ఢిల్లీలో ఘనంగా సత్కరించారు. జమ్మూకశ్మీర్‌లో గల వైష్ణోదేవి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలిపారు. కేం ద్ర మంత్రి మాట్లాడుతూ.. బీజేపీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు సమూచిత స్థానం లభిస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కృషిచేస్తానని చెప్పారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన భరత్‌ప్రసాద్


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో భరత్ ప్రసాద్

ఆమనగల్లు, జూన్ 10 : కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డిని సోమవారం నాగర్‌కర్నూల్ ఎంపీ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ కలిశారు. ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరానని భరత్‌ప్రసాద్ తెలిపారు.

విద్యాభివృద్ధిలో ఎన్నారైలు భాగస్వాములు కావాలి

కడ్తాల్, జూన్ 10 : విద్యాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రవాస భారతీయులు భాగస్వాములు కావాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడురు లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. అమెరికాలో స్థిరపడ్డ ఎన్.ఆర్.ఐలు తమ సొంత గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, పేద విద్యార్థులకు చేయూతనందించేందుకు ముందుకు రావాలన్నారు. అమెరికాలోని జార్జియాలో అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఆటా 2024 వేడుకల్లో మూడో రోజు సోమవారం ప్రవాస భారతీయులు ఏర్పాటు చేసిన తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం కార్యక్రమంలో లక్ష్మీనర్సింహారెడ్డి పాల్గొన్నారు. టీడీఎఫ్ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణలో విద్య, వైద్యం, నీటి పారుదల తదితర అంశాలపైన చర్చించినట్లు ఆయన తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న విద్యా పథకాలు సత్ఫలితాలు సాధించే దిశగా ప్రభుత్వం, ప్రవాస భారతీయుల భాగస్వామ్యంపై చర్చించినట్లు తెలిపారు. సమావేశంలో ఎల్ఎన్.రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు విద్యాభ్యాసం, క్రీడలలో సాధించిన విజయాలను అందరికీ తెలిసేలా ప్రతీ గ్రామంలో కరపత్రాల ద్వారా, అందుబాటులో ఉన్న వ్యవస్థల ద్వారా ప్రచారం నిర్వహించాలని, ఎక్కువ మొత్తంలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసే విధంగా ఉపాధ్యాయులతో కలిసి ప్రణాళికలు రచించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.


ఎన్నారైల ఫోరం సదస్సులో పాల్గొన్న లక్ష్మీనర్సింహారెడ్డి

సంక్షిప్తంగా...

● **చేవెళ్ల:** పశు వైద్యుల నిర్లక్ష్యం వల్ల అనేక పశువులు మృతిచెందుతున్నాయని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాధవరెడ్డి, కోశాధికారి మాణిక్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్ అన్నినరు. సోమవారం చేవెళ్లలో కిసాన్ సంఘ్ సమావేశం నిర్వహించిన అనంతరం పశువైద్యఅధికారులకు వినతిప్రతం అందించారు. వారు మాట్లాడుతూ.. చేవెళ్ల మండలం గుండాలలో శ్రీరాంరెడ్డి పాడి ఆవు వైద్యం అందక మృతిచెందిందన్నారు. గ్రామాల్లో పశువులకు వైద్యం అందడం లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న పశువైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

● **కేశంపేట:** కేశంపేట మాజీ సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డికి పితృ వియోగం కలిగింది. వెంకట్‌రెడ్డి తండ్రి అనంతరెడ్డి(85) ఆదివారం మృతిచెందారు. ఎంపీపీ వై.రవీందర్ సోమవారం అనంతరెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అలాగే వెంకట్‌రెడ్డి కుటుంబానికి సానుభూతిని వ్యక్తం చేశారు.

● **కేశంపేట:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నూతన రాజముద్రకు ధర్మసమాజ్ పార్టీ(డీఎస్‌పీ) ప్రతిపాదించిన చిహ్నాన్ని ఆమోదించాలంటూ తహసీల్దార్ ఆజంఅలీకి డీఎస్‌పీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. తెలంగాణ స్వరూపాన్ని తెలియజేసేలా డీఎస్‌పీ చిహ్నాన్ని రూపొందించిదని, దానిని పరిశీలించి అమోదించాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు శివ, ఉపాధ్యాక్షుడు మల్లేష్, కార్యదర్శి కృష్ణ, నర్సింలు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

● **ఆమనగల్లు:** ఆమనగల్లులోని వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో గల సద్గురు నిత్య శుద్ధానంద స్వామి క్షేత్రంలో ఈ నెల 13న 60వ విష్ణు సహస్రనామ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యజ్ఞంలో వివిధ ప్రాంతాల సాధువులు, స్వామీజీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

● **షాబాద్:** గృహజ్యోతి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ అన్నారు. హైతాబాద్‌లో గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు జీరో బిల్లును అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో ఎన్నికల కోడ్ కారణంగా ఇప్పటి వరకు గృహజ్యోతి అములు కాలేదన్నారు. ఎన్నికల కోడ్ ముగియడంతో పథకం వర్తిసుందన్నారు. పేద వినియోగదారులకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కోసం ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్లను అందజేయాలన్నారు. ఖాజామియా, వెంకట్‌రెడ్డి, రామస్వామి, జానీ, ప్రశాంత్, మహిపాల్‌రెడ్డి, సురేష్, దయానంద్, జంగయ్య పాల్గొన్నారు.

● **చేవెళ్ల:** చేవెళ్లలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలో అవర్లి బేస్ టీచర్స్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందని ప్రిన్సిపాల్ టేనవతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ... చేవెళ్లలో మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో 5(పీజీటి) అవర్లీ బేస్డ్ టీచర్ల పోస్టులకు అవకాశం ఉందన్నారు. సబ్జెక్టులు తెలుగు(2), హిందీ, ఫిజిక్స్ జువాలజీ ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు డిగ్రీ, పీజీ, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలు, అనుభవం లాంటి అంశాలను ప్రాతిపదికగా తీసుకుని మెరిట్ అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ నెల 12న మెడల్ స్కూల్‌లో అభ్యర్థులకు ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.

● **శంషాబాద్ రూరల్:** ముచ్చింతల్ స్వర్ణ భారత్ ట్రస్ట్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్‌ల అధ్వర్యంలో ట్రస్ట్‌లో నిర్వహిస్తున్న బ్యూటీ పార్లర్ ఉచిత శిక్షణ శిబిరాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. 30 రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందని చెప్పారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన మహిళలే అయి ఉండాలని చెప్పారు. వయస్సు 19 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతి, కల్పిస్తామని చెప్పారు. మహిళలు ఆధార్, రేషన్ కార్డు, 3 ఫొటోలు తీసురావాలని చెప్పారు. వివరాల కోసం 9391487797/9177141712 కాల్ చేయాలని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

ఇటుక బట్టీలో ఒడిశా కార్మికుడి హత్య

మహేశ్వరం, జూన్ 10: ఇద్దరు కార్మికుల మధ్య జరిగిన గొడవ చినికి చినికి గాలి వానలా మారి ఒక హత్యకు దారితీసింది. దీనికి సబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తుమ్మలూరులో గల ఓ ఇటుక బట్టీలో ఒడిశాకు చెందిన తులారాం(45), క్షేత్రోయాదవ్(32) కూలీలుగా పని చేస్తున్నారు. ఆదివారం రాత్రి ఇద్దరికి గొడవ జరిగి తులారాంను క్షేత్రోయాదవ్ ఇనుప ఆడ్డుతో కొట్టగా అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఇటుకబట్టీ యజమాని మంగ్యానాయక్ సోమవారం పోలీసులకు సమాచా రం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని తులారాం మృతదేహాన్ని పోస్టుమార్టంకు, క్షేత్రోయాదవ్‌ను రిమాండ్‌కు తరలించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం


అదృశ్యమైన బాబు, సుగుణ

యాచారం/శంకర్‌పల్లి, జూన్ 10: వేర్వేరు చోట్ల ఇద్దరు వ్యక్తులు అదృశ్యమయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. యాచారం మండలం మాల్‌కు వెళ్లి వస్తానని వెళ్లిన వ్యక్తి 14రోజులైనా తిరిగి రాలేదని నల్లవెల్లికి చెందిన చెన్నయ్య సోమవారం పోలీసులను ఆశ్రయించారు. పాలమూరు జిల్లా జడ్చర్లకు చెందిన బాబు, అతడి సోదరుడు చెన్నయ్య నల్లవెల్లిలో ఓ రైతు వద్ద ఉండి పొలం పనులు చేసుకుంటున్నారు. మే 27న బాబు(55) మాల్‌కు వెళ్లివస్తానని చెప్పి వెళ్లాడు. అతడి కోసం ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు చెన్నయ్య చెప్పాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాల్ తెలిపారు. అలాగే శంకర్‌పల్లి మండలంలో ఓ మహిళ కనిపించకుండా పోయిందని మోకిల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. కొండకల్ తండాకు చెందిన సుగుణ(45) ఆదివారం సాయంత్రం బయటకు వెళ్లింది. ఆమె తిరిగి రాలేదు. సుగుణ భర్త చందర్ కొన్నాళ్ల క్రితం చనిపోయాడు. సుగుణకు కల్లు తాగే అలవాటు ఉందని, ఆమె అనారోగ్యంతో బాధపడుతోందని ఎస్సై తెలిపారు. సుగుణ కొడుకు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.